# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

OCTOBER - 2001

# సంక్షిప్త వార్తలు

2001 సెప్టెంబరు 1వ తేదీ శనివారం Rajahmundry Church of Christ Charitable Society వారు విధవరాండ్రకు, అనాధలకు చీరలు, దుప్పట్లు ఉచితముగా పంచియిచ్చిరి. బీద విద్యార్థులకు నోటు పుస్తకములు, పెన్నులు కూడా యిచ్చిరి. ఈ గొప్ప దాన కార్యక్రమములో సోదరులు జాషువా గూటం గారు పాల్గొని వాక్యపరిచర్య చేసిరి. సోదరులు యస్.జాన్ గారు Rajahmundry Church of Christ Charitable Societyకి సారధ్యము వహిస్తు పరిసర ప్రాంతములలో క్రీస్తుకొరకు మంచి కార్యములు చేయుచున్నారు.

సెప్టెంబరు 7వ తేదీ శుక్రవారం నాడు తూర్పుగోదావరి జిల్లా కరప మండలం వేళంగి గ్రామములో సువార్తికుల సదస్సు జరిగెను. వేళంగి మెయిన్‌రోడ్ లోనే యున్న క్రీస్తుసంఘ ఆవరణమునకు సువార్తికులు తదితరులు సకాలమునకు హాజరుకాగా "ఆరాధనలో సంగీతము" అను అంశము చర్చించబడెను. ఉదయకాల సదస్సు ఆచంట నుండి వచ్చిన సోదరులు పి. సామ్యేలు రాజుగారి ప్రార్ధనతో ఆరంభమాయెను. తదుపరి సోదరులు టి.వి.యస్. కుమార్‌గారు వేళంగి స్థానిక క్రీస్తుసంఘ చరిత్రను క్లుప్తముగా వివరించి గత 30 ఏండ్లనుండి వేళంగిలో క్రీస్తు సంఘము యొక్క పని కొనసాగుచున్నట్లు తెలియజేసిరి. అటు తరువాత సోదరులు బూలయోహాను (పల్లంకుర్రు), వేమగిరి యేసు (పిఠాపురం), ఉండ్రు స్టాలిన్ (గుత్తినదీవి), టి.వి.యస్. కుమార్ గార్లు ఆరాధనలో దేవుడు కోరు సంగీతమును గూర్చి వివరించిరి. సోదరులు యస్. ప్రసాద్ (రామచంద్రపురం) గారి ప్రార్ధనతో ఉదయకాల కూటము ముగిసెను. మధ్యాహ్నకాల కూటము సోదరులు సి.హెచ్. మణికుమార్ (రామచంద్రపురం) గారి ప్రార్ధనతో ప్రారంభము కాగా, టి. సుధీర్ (కాకినాడ), కె. దామోధరరావ్ (కోడూరు), కె.యస్.కె. శర్మ (పుల్లేటికుర్రు) మరియు జాషువా గూటం గార్లు ఆరాధనలో దేవుడు కోరునట్టి సంగీతమును గూర్చి దైవవేదము నుండి చర్చించిరి.

వేళంగిలో యున్న క్రీస్తు సంఘము, స్థానిక బోధకులు యస్. శ్యాంప్రసాద్ గారు అందరు అత్యాసక్తితో కృషిచేసి సదస్సును జయప్రదం చేసిరి. వచ్చిన వారందరికీ మంచి ఆతిధ్యమిచ్చిరి. సోదరులు యస్. ఏలియా (దేవగుప్తం) గారి ప్రార్ధనతో సదస్సు ముగిసెను.

ఆగష్టు 30వ తేదీ ఉదయం రిక్కీగూటం గారు బయలు దేరి 31వ తేదీ

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box 80, Kakinada, A.P. 533 001

Phone : 0884 - 363722

Editor :

JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 22 అక్టోబర్ 2001 సంచిక 3


# మానవుని తత్వము-2

## (The Nature of Man)

మానవుని తత్వాన్ని గూర్చి గతపాఠంలో కొంత తెలిసికొన్నాము. మానవుడు దేవునిచే సృజింపబడిన వ్యక్తి, వివేక విశిష్టమైన వ్యక్తి, నైతిక స్వేచ్ఛ గలవాడు మరియు మనస్సాక్షి గలవాడని కూడ మనం గతసంచికలో గమనించాము. అంతేకాదు మానవుడు కనీసం రెండు తత్వాలు, అంటే శరీరక తత్వం, ఆత్మీయ తత్వం గలవాడని కూడా మనం గమనించాము.

మానవుని సంపూర్ణ తత్వమంతయు శరీరము, జీవము, ఆత్మయని అపొ.పౌలు చెప్పుచున్నాడు. "మీ ఆత్మయు, జీవమును, శరీరమును మన

ప్రభువైన యేసు క్రీస్తు రాకడయందు నిందారహితముగాను సంపూర్ణముగాను ఉండునట్లు కాపాడబడునుగాక" యని అతడు 1 థెస్స 5:23లో చెప్పాడు. శరీరము అనగా భౌతికదేహము. జీవమనగా ప్రాణమును లేక మానవుని జీవమును సూచించును. ఐగుప్తీయులను గూర్చి చెబుతు దేవుడు "మరణము నుండి వారి ప్రాణమును తప్పింపక వారి జీవమును తెగులునకు అప్పగించెను" అని దావీదు వ్రాసాడు (కీర్తన 78:50). ఆత్మయనగా అమర్త్యమైన మానవుని తత్వము. ఆత్మయను మాటకు ఇంగ్లీషులో Soul మరియు Spirit అను పదములు సరిసమానముగా వాడబడెను. మానవుడు శరీరము, ఆత్మయని లేఖనములు చెప్పుచున్నవి.

"క్రీస్తు మీలో నున్నయెడల మీ శరీరము పాపవిషయమై మృతమైనది గాని మీ ఆత్మ నీతి విషయమై జీవము కలిగియున్నది" యని రోమా 8:10లో వ్రాయబడియున్నది. ఇక్కడ శరీరము మర్త్యమైనదని ఆత్మ అమర్త్యమైనదని మరల వక్కాణించబడెను. "కావున మేము అధైర్యపడము; మా బాహ్య పురుషుడు కృశించుచున్నను, ఆంతర్య పురుషుడు దినదినము నూతన పరచబడు చున్నాడు" అని అపొ. పౌలు చెప్పెను (2 కొరింథి 4:17). మానవుడు బాహ్య పురుషుడు, ఆంతరంగ పురుషుడని వర్ణించబడినప్పుడు పౌలు మానవుని మిశ్రమ తత్వమును మరల సూచించాడు. మానవుని శరీరములో మానవుని ఆత్మ నివసించును.

"దానియేలను నేను నా దేహములో మనోదుఃఖము గలవాడనైతిని" యని దానియేలు పలికెను (దానియేలు 7:15). మనుష్యుని యొక్క యధార్థమైన "నేను" అనునది అతని శరీరములో నివసించు అదృశ్య ఆత్మ. మనుష్యుల అంత రంగములో జీవాత్మను సృజించువాడు యెహోవాయని జెకర్యా ప్రవక్త చెప్పెను (జెకర్యా 12:1). "అయినను నరులలో ఆత్మయొకటి యున్నది. సర్వశక్తుడగు దేవుని ఊపిరి వారికి వివేచన కలుగజేయును" అని

యోబు 32:8లో వ్రాయబడి యున్నది. గనుక మానవుడు శరీరములో నివసించుచున్న ఒక ఆత్మ, ఆ యాత్మయే అతని నిజవ్యక్తిత్వము.

మానవుని ఆత్మ దేవుని నుండి ఉద్భవించినందు వలన అది తండ్రియైన దేవునివలె అమర్త్యమైనదని బైబిలు బోధించుచున్నది. "దేవుడు ఆత్మయై యున్నాడు" (యోహాను 4:24). మన శరీరసంబంధులైన తండ్రులకు వ్యత్యాసముగా దేవుడు మన ఆత్మలకు తండ్రి (హెబ్రీ 12:9). మనము దేవుని సంతానమై యున్నామని అపొ.పౌలు ప్రకటించాడు. "కాబట్టి మనము దేవుని సంతానమై యుండి మనుష్యుల చమత్కార కల్పన వలన మల్చబడిన బంగారమునైనను, వెండినైనను, రాతినైనను దేవత్వము పోలియున్నదని తలంప కూడదు" (అపొ.కా. 17:29) అని అతడు చెప్పాడు.

దేవుడు ఆత్మయైయున్నాడు. మానవుని ఆత్మదేవుని సంతానమై యున్నది. ఆత్మదేవుని నుండి కలిగినది గనక అది మానవుని అమర్త్యభాగమై యున్నది. అమర్త్యమనగా మరణంలేనిది, నిత్యము ఉండునదియని అర్థం. శరీరము ద్వారా మానవుడు ఈ భూమితో సంబంధము కలిగియున్నను, తన ఆత్మ ద్వారా అతడు దేవుని స్వరూపమందున్నాడు. ఏ జాతినుండి ఆ జాతియే ఉద్భవించును. దేవుడు మానవుని ఆత్మను తన అమర్త్య ఆత్మను బట్టి సృజించెను గనుక మానవుని ఆత్మ అమర్త్యమైనది (1 తిమోతి 1:17). దేవుడు నిత్యుడు. యుగయుగములకు ఆయనే దేవుడు (కీర్తన 90:1-2). ఆయన సమస్త జీవమునకు ఆధారభూతుడు. తనంతట తానే జీవముగలవాడు (యోహాను 5:26). మరియు దేవునివలె మానవుడు అమర్త్యుడు. ఏలయనగా అతని ఆత్మ దేవుని ఆత్మీయ స్వరూపమందు సృజింపబడెను.

"దేవుని శాశ్వతకాల జ్ఞానమును నరుల హృదయమందుంచి యున్నాడు" (ప్రసంగి 3:11). "నరుని ఆత్మ యెహోవా పెట్టిన దీపము" (సామెతలు 20:27). మానవుని హృదయాంతరంగ పురుషుడు అక్షయమైన వాటితో అలంకరింపబడ

వలెనని అపొ.పేతురు చెప్పాడు. "సాధువైనట్టియు, మృదువైనట్టియునైన గుణమను అక్షయాలంకారముగల మీ హృదయపు అంతరంగ స్వభావము మీకు అలంకారముగా నుండవలెనని" అతడు చెప్పాడు (1 పేతురు 3:4). "అది దేవుని దృష్టికి మిగుల విలువగలది". హృదయాత్మల అంతరంగ పురుషుడు అసలైన మానవుడు. శరీరము మాత్రమే మర్త్యమైనది. "చావునకు లోనైన మీ శరీరమందు పాపమును ఏలనియ్యకుడి" యని పౌలు చెప్పాడు (రోమా 6:12). "మృతులలోనుండి క్రీస్తు యేసును లేపినవాడు చావునకు లోనైన మీ శరీరములను కూడ మీలో నివసించుచున్న తన ఆత్మద్వారా జీవింపజేయును" (రోమా 8:11). చావునకు లోనైనది శరీరమే గాని ఆత్మకాదు. పునరుత్థానమందు శరీరము కూడా అమర్త్యమైనదగును (1 కొరింథీ 15:42-45).

మానవుని ఆత్మ అమర్త్యమైనది. అది గాలిని, ఊపిరిని సూచించక మానవునిలో వివేక విశిష్టమైన భాగమును, మరణమునొందని ఆత్మను సూచించుచున్నది. మానవుడు దేవుని స్వరూపమందు ఆయన పోలిక చొప్పున సృజింప బడ్డాడు. దేవుడు భౌతికకాయుడు కాదు గనుక మానవుని శరీరాకృతులు అతని తలిదండ్రుల నుండి సంక్రమించినవి. దేవుడు ఆత్మ గనుక మానవుడు దేవుని ఆత్మీయ స్వరూపమందు చేయబడినవాడు. అందువలన అతడు నైతిక తత్వమును, ఇంగిత జ్ఞానాన్ని, వివేచన శక్తిని కలిగియున్నాడు. దైవాత్మ లక్షణములగు ప్రేమ, సంతోషము, దీర్ఘశాంతము, మంచితనము వగయిరాలను మానవుడు కూడా కలిగియున్నాడు.

మానవుని ఆత్మ మానవుని సంగతులనెరిగి యున్నది. "ఒక మనుష్యుని సంగతులు అతనిలో నున్న మనుష్యాత్మకే గాని మనుష్యులలో మరిఎవరికి తెలియును? "అలాగే దేవుని సంగతులు దేవుని ఆత్మకేగాని మరి ఎవనికిని తెలియవు. దేవుని వలనమనకు దయచేయబడిన వాటిని తెలిసికొనుటకై మనము లౌకికాత్మను గాక దేవుని యొద్దనుండి వచ్చు ఆత్మను పొందియున్నాము" (1

కొరింథీ 2:11-12). పౌలు దేవుని ఆత్మతో సేవించెను. మనస్సుతోను సేవించెను (1 కొరింథీ 14:15). మానవుని ఆత్మమంటిలో నుండి గాక నిత్య దేవుని నుండి కలిగెను. గనుక ఆత్మనిత్యము ఉండునట్టిది. శరీరము క్షీణించి పోయినను అది జీవించునట్టిది.

అందువలన యెహోవాచే సృజింపబడిన మానవుడు మరణానంతరము కూడా జీవించునట్టి అమర్త్య ఆత్మయైయున్నాడు. కంటికి కనబడు అతని భౌతిక కాయము విషయమైతే అతడు మర్త్యుడు; కాని మరణములేని, దేవుని నుండి కలిగిన అంతరంగిక జ్ఞానము గల ఆత్మ విషయమైతే అతడు అమర్త్యుడు.

మానవుడు రెండు లోకాలతో సంబంధము కలిగయున్నాడు. అతడు ఈ లోకంలో జీవించుచున్నాడు అయినను పరలోకం అతని నిత్యగృహం. అతడు ప్రస్తుతము జీవించుచున్నను, నిత్యత్వాన్ని గూర్చిన ఆసక్తి కలవాడు. అతడు నిత్యత్వంలో ప్రవేశించి సుఖంగా యుండడానికి దేవుని సంకల్పమును తెలిసి కొనవలసి యున్నది. "మంటినుండి పుట్టిన వాడెట్టివాడో మంటినుండి పుట్టిన వారును అట్టివారే, పరలోక సంబంధి యెట్టివాడో పరలోక సంబంధులును అట్టివారే. మరియు మనము మంటి నుండి పుట్టిన వాని పోలికను ధరించిన ప్రకారము పరలోక సంబంధి పోలికయు ధరింతుము" అని అపొ. పౌలు చెప్పాడు (1 కొరింధి 15:48-49).

మానవుడు భౌతికజీవి. మానవుడు ఆత్మీయజీవికూడాను. అతడీలోకంలో జీవిస్తు పరలోకంలో జీవించడానికి నిశ్చయించుకోవాలి. నేటి గురించి అతడు ఆసక్తిని చూపించుచు, నిత్యత్వం గురించి మరింత ఆసక్తి కలిగి యుండాలి. అతడు మర్త్యుడే అయినను, అమర్త్యుడుకూడాను. "కావున దేహమందున్నను దేహమును విడిచినను, ఆయన కిష్టులమై యుండవలెనని మిగుల అపేక్షించు చున్నాము. ఎందుకనగా తాను జరిగించిన క్రియలచొప్పున అవి మంచివైనను సరే చెడ్డవైనను సరే దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును

పొందునట్లు మనమందరము క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును" (2 కొరింథి 5:9-10).

"ఇదంతయు వినిన తరువాత తేలిన ఫలితార్థమిదే; దేవునియందు భయ భక్తులు కలిగియుండి ఆయన కట్టడల ననుసరించి నడుచుచుండవలెను; మానవకోటికి ఇదియే విధి" (ప్రసంగి 12:13). ఈ లోకంలో జీవిస్తుయుండగా, యేసుప్రభువు నందు విశ్వాసముంచి, పాపముల విషయమై మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందవలెను. మరియు, మరణ పర్యంతము ఆయనకు నమ్మకముగా జీవించవలెను. మనం నమ్మకముగా యున్నట్లయితే నిత్యజీవకిరీటాన్ని ఆయన మనకు ప్రసాదించును (ప్రకటన 2:10). పాపము నుండి విమోచించి పరలోకంలో చేర్చుకొనును.

# పైకిచూడు
## (Look up)

గ్రీకు భాషలో మానవునికి ఏన్‌త్రోపాస్ (anthropos) అను పదము వాడబడినది. దానికి పైకి చూచువాడని యర్థము. అయితే మనం పైకి చూచుటలో సమయమును వెచ్చించే వారముగ ఇప్పుడు లేము. గంటల తరబడి టెలివిజన్ చూస్తూనే మానవుడు తన సమయాన్ని వెచ్చించుచున్నాడు. తన కంప్యూటర్‌ను చూస్తూ అతడు చాల సమయాన్ని వెచ్చించుచున్నాడు. ఇంటర్‌నెట్‌ను పరీక్షిస్తు చాల సమయాన్ని అతడు గడిపేస్తున్నాడు. మన సమాజం

వినోదం, వ్యాపారం, క్రీడలు, మీదనే ఎక్కువకాలం గడిపేస్తున్నది. పరలోక మందున్న దేవునిపైన, ఆత్మీయ సంగతులపైన గాక మానవులు పలు యితర సంగతులపై తమ దృష్టిని కేంద్రీకరించియున్నారు. నేటి మానవునికి బైబిలు ఏమైనా బోధించుచున్నదంటే, అదే యిది - పైకి చూడు !

## దేవుని వైపు చూడాలి

మొదటిగా మనం పరలోకమందున్న దేవునివైపు చూడాలి. "దేవుడొకడు పరలోకమందున్నాడు" అని దానియేలు 2:28 చెప్పుచున్నది. దానిని మనం మరచిపోయామా ? దావీదు మరచిపోలేదు. కీర్తనలు 8:3-4లో అతడిట్లను చున్నాడు: "నీ చేతిపనియైన నీ ఆకాశములను నీవు కలుగజేసిన చంద్ర నక్షత్రములను నేను చూడగా, నీవు మనుష్యుని జ్ఞాపకము చేసికొనుటకు వాడే పాటివాడు? నీవు నరపుత్రుని దర్శించుటకు వాడేపాటివాడు ?". కీర్తనలు 121:1లో మనం పైకి ఎందుకు చూడాలో ఒక కారణం ఈయబడినది. "కొండల తట్టు నా కన్నులెత్తుచున్నాను. నాకు సహాయము ఎక్కడ నుండి వచ్చును? యెహోవా వలననే నాకు సహాయము కలుగును". పరమందున్న దేవునివైపు పైకి చూడవలసిన మరొక కారణంవున్నది: "భూదిగంతముల నివాసులారా, నావైపు చూచి రక్షణ పొందుడి. దేవుడను నేనే, మరి ఏ దేవుడును లేడు" అని ఆయన చెప్పుచున్నాడు (యెషయా 45:22). మోషేవలె అదృశ్యుడైన వానిని చూచుచుయుంటే ఈ జీవిత సంక్షోభములను మనం సహించుకో గల్గుదుము (హెబ్రీ 11:27).

## క్రీస్తువైపు చూడాలి

రెండవదిగా, మనం కన్నులు పైకెత్తి క్రీస్తువైపు చూడాలి. యేసును చూపిస్తు బాప్తిస్మమిచ్చు యోహాను, "ఇదిగో లోకపాపమును మోసికొనుపోవు దేవుని గొర్రెపిల్ల" యని చెప్పాడు (యోహాను 1:29). నశించినవారు, రక్షింపబడినవారు

కూడ క్రీస్తు సిలువవైపు చూడాలి. "నేను భూమి మీద నుండి పైకెత్తబడిన యెడల అందరిని నా యొద్దకు ఆకర్షించుకొందునని" క్రీస్తు చెప్పెను (యోహాను 12:32). మన విశ్వాసమునకు కర్తయు దాని కొనసాగించువాడైన యేసువైపు మనము చూస్తూ యుండాలని హెబ్రీ 12:2లో చెప్పబడియున్నది. మనం క్రీస్తు యొక్క రెండవ రాకడను గూర్చి కూడా చూస్తూ యుండాలి. "మనపౌర స్థితి పరలోకమందున్నది; అక్కడ నుండి మన ప్రభువైన యేసుక్రీస్తు అను రక్షకుని నిమిత్తము కనిపెట్టుకొని యుండాలని" అపొ.పౌలు చెప్పాడు (ఫిలిప్పీ 3:20). మనము శుభప్రదమైన నిరీక్షణ నిమిత్తము మన రక్షకుడైన యేసుక్రీస్తు మహిమ యొక్క ప్రత్యక్షత కొరకు ఎదురుచూచుచున్నామని తీతు 2:13లో వ్రాయబడియున్నది. మనము దేవుని దినపు రాకడ కొరకు ఆశతో అపేక్షించుచు ఎంతో జాగ్రత్త గలవరై యుండవలెనని అపొ.పేతురు చెప్పెను (2 పేతురు 3:12).

మూడవదిగా, క్రైస్తవులు కన్నులెత్తి తెల్లబారి కోతకు వచ్చియున్న పొలములను చూడాలి (యోహాను 4:35). లోకము పాపములో పడి నశించు చున్నది. కోట్లకొలది ప్రజలు రక్షింపబడకుండా పాపములోనే యుండి నశించి పోవుచున్నారు. అపవాదికి లోనైపోయినవారి ఆత్మలను రక్షించే తరుణములు ప్రతిరోజు వున్నవి. అయితే అట్టివారికి రక్షకుడైన యేసుక్రీస్తును గూర్చి తెలియజెప్పే తరుణము కొరకు మనము వెదుకుచున్నామా ? "మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షించబడును, నమ్మనివానికి శిక్ష విధించబడునని" యేసు చెప్పెను (మార్కు 16:15-16). సువార్తంటే యెవరికీ ఆసక్తిలేదని తరుచు మనం అంటాము. అట్లు కానేకాదు ! సమస్యయేమంటే, క్రైస్తవులమైన మనం తెల్లబారి కోతకు వచ్చియున్న పొలములనుగాక వేరే సంగతులను చూస్తూ కూర్చున్నాము !

## పరలోకం వైపు చూడాలి

చివరిగా, మనం పరలోకము వైపుచూడాలి. మేము ఎంత పరసంబంధమైన మనస్సు కలిగియున్నామంటే, భూసంబంధమైన వాటిని పట్టించుకోలేమని ఒకాయన అన్నాడు. గాని అది సత్యంకాదు. నిజానికి మనం ఎంత భూసంబంధమైన మనస్సు కలిగిన వారమంటే పరలోకాన్ని గూర్చి పట్టించు కొనడంలేదు. అపో.పౌలు యిట్లు చెప్పాడు: "మీరు క్రీస్తుతో కూడ లేపబడిన వారైతే పైనున్న వాటినే వెదకుడి, అక్కడ క్రీస్తు దేవుని కుడిపార్శ్వమున కూర్చుండి యున్నాడు. పైనున్న వాటిమీదనే గాని భూసంబంధమైన వాటిమీద మనస్సు పెట్టుకొనకుడి" (కొలస్స 3:1-2). సంఘములో అబ్రాహాము లాంటి వ్యక్తులు మనకు అనేకులు కావాలి. "ఏలయనగా దేవుడు దేనికి శిల్పియు నిర్మాణకుడునై యున్నాడో పునాదులు గల ఆ పట్టణము కొరకు అబ్రాహాము ఎదురు చూచుచుండెను" (హెబ్రీ 11:10). పాత నిబంధన భక్తులు "తాము భూమి మీద పరదేశులమును, యాత్రికులమునై యున్నామని ఒప్పుకొనిరి" (హెబ్రీ 11:13). అనగా వారు పరలోక సంబంధమైన దేశమును కోరుకున్నారు. అందుచేత తాను వారి దేవుడనని అనిపించుకొనుటకు దేవుడు వారిని గూర్చి సిగ్గుపడడు; ఏలయనగా ఆయన వారి కొరకు ఒక పట్టణము సిద్ధపరచియున్నాడు (హెబ్రీ 11:14-16). మిత్రులారా, మనం పరలోకము వైపు చూస్తుయుండాలి. తద్వారా ఒక శ్రేష్టమైన దేశం మనకున్నదని మనకు గుర్తుంటాది. మరణం తరువాత జీవితంవున్నది. దేవుని తోను, రక్షింపబడిన భూవాసులందరితోను నిత్యము నివసించే స్థలం అది.

## ఆలస్యం వలదు

చివరిగా, దేవునివైపు ఆలస్యంగా చూచే ఘడియ కూడా రావచ్చునని హెచ్చరింపగోర్తాను. రక్షింపబడనివారు దేవునివైపు చూచి ఆయనకు మొర్రపెట్టుదురు గాని, ఆలస్యం చేసినందున ఆయన వారి మొరను వినడని

సామెతలు 1:28 వలన మనకు తెలియుచున్నది. మనకు సమయం, తరుణం వుండగానే, దేవుని వైపు, క్రీస్తువైపు, రక్షింపబడని వారివైపు మన దృష్టి మళ్లించాలి. క్రీస్తు మరల వచ్చునప్పుడు ప్రతినేత్రము ఆయనను చూచును (ప్రక 1:7). అయితే రక్షింపబడని వారికది అప్పటికే చాల ఆలస్యమైపోయిన సమయం. మనం ఈ లోకమునుండి, లోకస్థుల నుండి, మననుండి మన దృష్టిని మళ్లించాలి. దేవుని తట్టు తిరగాలి !

-- జాన్ స్టాట్

●●●●●

# పరిశుద్ధాత్మ మరియు అద్భుత వరములు

మొదటి శతాబ్దమందలి స్థానిక సంఘములు పరిశుద్ధాత్మ వరములు లేక అద్భుత వరములను కలిగి యుండిరి. ఆ కాలమందు క్రొత్తనిబంధన గ్రంథ రూపములో లేనందున ఈ వరములు ద్వారా ఆనాటి క్రైస్తవులు అద్భుత కార్యములను జరిగించుటకు శక్తిని కలిగియుండిరి. ఈ వరములు ప్రతి క్రైస్తవునిలో నివసించునట్టి పరిశుద్ధాత్మ వరము వలన గాని లేక పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందుట వలన గాని కలిగినవి కావు. దేవుని చిత్తమును జరిగించుటకు, మరియు గ్రహించుటకు ఆనాటి సంఘమునకు యివ్వబడిన ప్రత్యేకమైన, తాత్కాలికమైన వరములైయున్నవి.

ఈ తొమ్మిది ప్రత్యేక వరములు మానవ చిత్తమును బట్టి గాక, పరిశుద్ధాత్మ చిత్తమును బట్టి అనుగ్రహింపబడినవి (1 కొరింథి 12:5-11).

## ఈ వరములు అపొస్తలులు చేతులుంచుట వలన అనుగ్రహింపబడెను

ఫిలిప్పు ఆత్మవలన అనుగ్రహింపబడిన వరములు కలిగియున్నను అతడా వరములను ఇతరులకిచ్చు అధికారమును కలిగియుండలేదు. అపొస్తలులు యెరూషలేము నుండి వచ్చి, వారి మీద చేతులుంచి సమరయ వారికి ఈ వరములను అనుగ్రహించిరి (అ.కా. 8:14-20).

## పరిశుద్ధాత్మ వరముల ప్రయోజనము

1. వాక్యము స్థిరపరచుట కొరకు ఈ వరములు ఇవ్వబడెను (యోహా 5:36; హెబ్రీ 2:3-4; అ.కా. 6:8, 8:6).
2. ఏ లోపములేని వాక్యమును బోధించుట కొరకు ఇవ్వబడెను (యోహా 16:13; అ.కా. 7:55).
3. పరిశుద్ధాత్మ ప్రేరణ వలన క్రొత్తనిబంధన లిఖించబడుట కొరకు ఇవ్వబడెను (2 తిమోతి 3:16-17; ఎఫె 3:3-5).
4. సంఘక్షేమాభివృద్ధి కొరకు ఇవ్వబడెను (1 కొరింథి 14:3-4).

## ఇవి తాత్కాలిక వరములు మాత్రమేగాక ఆదిమ సంఘకాలమందే నిలిచిపోయెను

1. పరిశుద్ధాత్మ వరముల ప్రయోజనము నెరవేరెను.
2. పూర్ణమైన వాక్యము వచ్చుసరికి అవి నిలిచిపోవలసినది (1 కొరింథి 13:8-13).
3. ఈ దినాలలో మన ఆత్మీయ అవసరములకు దేవుని వాక్యమే ఆధారము (2 తిమోతి 3:16-17; 2 పేతురు 1:3).

# పరిశుద్ధాత్మ అద్భుత వరములు
## నేడు దేవుని వాక్యము ఈ వరములకు బదులుగా యివ్వబడినది

1. **బుద్ధి వాక్యము (Word of Wisdom):** ఎవనికైనను నేడు వివేకము కొదువగా ఉన్నయెడల అతడు దేవుని అడుగవలెను (యాకో 1:5). దేవుని వాక్యమందున్న ఆయన సంకల్ప మును ఎరుగుటయే వివేకము (1 కొరింథీ 15:1-4).
2. **జ్ఞాన వాక్యము (Word of Knowledge):** దేవుని గ్రంధము చదువుటవలన మన జ్ఞానము వృద్ధియగును (2 తిమో 2:15; ఎఫె 3:1-7). మనకవసర మైన అనుభవజ్ఞానము మనకివ్వబడెను (2 పేతురు 1:3).
3. **విశ్వాసము (Faith):** వినుటవలన నేడు విశ్వాసము కలుగుచున్నది (రోమా 10:17).
4. **స్వస్థపరచు వరము (Healing):** అద్భుత స్వస్థత వరము మొదటి శతాబ్దములోనే నిలిచిపోయెను. అద్భుత స్వస్థతలు జరిగించినవారు ఆ కాలములో వాటిని కొనసాగించ లేకపోయిరి (1 తిమో 5:23; 2 తిమో 4:20). నేడు మనం రోగుల కొరకు ప్రార్థించుచు మందులు వాడుచు యుండాలని వాక్యము సెలవిచ్చుచున్నది. ఈ దైవికమైన స్వస్థత దేవుని చిత్తమును బట్టి జరుగుతుంది (యాకో 5:13-15). యిది అద్భుత స్వస్థత కాదు.
5. **అద్భుతకార్యములు చేయుశక్తి (Miracles):** వెండి, బంగారములు లేని పేతురు కుంటివానిని స్వస్థపరచెను (అ.కా. 3:1-8). నేడు అద్భుత కార్యములను చేయుశక్తి లేని మనము మన ధనాన్ని పేదల కొరకు ఖర్చుచేయాలి. యిచ్చుట అనేది ఆశీర్వాదము. దీనివలన సంఘము అవసరాలలో

ఉన్నవారిని ఆదుకొంటుంది (రోమా 15:26).

6. ప్రవచన వరము (Prophecy): దేవుని ప్రజలకు మనం సందేశాన్ని అందించాలంటే దేవుని వాక్యమును చదవాలి (2 తిమో 2:15; హెబ్రీ 5:12).

7. ఆత్మల వివేచన (Discerning of Spirits): అబద్ధబోధలను ఖండించుటకు, గద్దించుటకు మనము లేఖన భాగములను బాగా ఎరిగి యుండాలి. హితబోధ విషయమై జనులను హెచ్చరించుటకు, ఖండించుటకు పెద్దలు పని కలిగి యున్నారు (తీతు 1:9-11).

8. నానా విధ భాషలు (Tongues): భాషలు అవిశ్వాసులకే సూచకమైతే ఈరోజు వాటిపని యేమి? పరిశుద్ధ గ్రంధము విశ్వాసమును పుట్టించును (రోమా 10:17). మనం పవిత్ర జీవితాన్ని జీవిస్తే అది పరిశుద్ధ గ్రంధము యొక్క సూచకమౌతుంది (1 పేతురు 2:11-12, 3:1-2).

9. భాషల అర్థముచెప్పు శక్తి (Interpretation of Tongues): భాషలు మాటలాడు వరము లేనప్పుడు వాటికి అర్థము చెప్పే అవసరముండదు. మనము దేవుని వాక్యమును చదివి, విశ్వాసముతో లేఖనములు యొక్క సందేశమును ప్రజలకు వివరించాలి (2 తిమో 2:15).

సేకరణ & అనువాదము

-- ఇ.కె.వి. ప్రసాదరావు

# నీకు తెలియునా ?

"మరియు నీవు పేతురువు, ఈ బండ మీద నా సంఘమును కట్టుదును. పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువ నేరవని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (మత్తయి 16:18).

## సంఘము అనగానేమి ?

1. సంఘము అను పదము "ఎక్లీషియా" అను గ్రీకు పదము నుండి వచ్చినది. దాని అర్థము "పిలువబడిన వారు" (థేయర్)
2. అది క్రీస్తు శరీరము (కొలస్స 1:18)
3. అది దేవుని కుటుంబము (1 తిమోతి 3:15; ఎఫెసీ 2:19)
4. అది క్రీస్తు రాజ్యము మరియు దేవుని రాజ్యము (మత్త 16:18,19; ఎఫెసీ 5:5; కొలస్స 1:13)
5. అది "సత్యమునకు స్తంభమును ఆధారమైయున్నది (1 తిమో 3:15)

## అది (సంఘము) క్రొత్తనిబంధనలో ఏమని పిలువబడినది ?

1. "నా సంఘము" క్రీస్తుప్రభువు సంఘము (మత్త 16:18)
2. సంఘము (అ.కా. 8:1)
3. ప్రభువు సంఘము (అ.కా. 20:28) The Church of the Lord
4. దేవుని సంఘము (1 కొరింథీ 1:1-2)
5. క్రీస్తు సంఘములు (రోమా 16:16)
6. క్రీస్తు శరీరము (ఎఫెసీ 1:22-23, 2:16; కొలస్స 1:18)
7. జ్యేష్ఠుల సంఘము (హెబ్రీ 12:23)

## సభ్యులు ఏమని పిలువబడుచున్నారు ?

1. శిష్యులు (అ.కా. 11:26, 20:27)
2. పరిశుద్ధులు (1 కొరిం 1:2)
3. దేవుని ప్రియులు (అనగా పరిశుద్ధులుగా ఉండుటకు పిలువబడినవారు) (రోమా 1:7)
4. సహోదరులు (1 కొరిం 15:6)
5. విశ్వాసులు (కొలస్స 1:12)
6. దేవుని కుమారులు (రోమా 8:17)
7. దేవుని పిల్లలు (1 యోహాను 3:1)
8. దేవుని వారసులు (రోమా 8:17)
9. రాజులైన యాజక సమూహము (1 పేతురు 2:9)
10. క్రైస్తవులు (అ.కా. 11:26; 1 పేతురు 4:16)

## నీవు ఈ ఆత్మీయ నామములను మాత్రమే ధరించుకొంటావా?

## సంఘము ఎప్పుడు స్థాపించబడినది ?

1. అంత్యదినములలో యెరూషలేములో (యెష 2:2-4)
2. "ఆ రాజుల (రోమా) కాలములో (దానియేలు 2:44)
3. యోహాను దినములలో అది "సమీపముగా ఉన్నది" (మత్త 3:1-2)
4. శిష్యులు అది (నీ రాజ్యము) వచ్చుగాక అని ప్రార్థించిరి (మత్త 6:9-10)
5. క్రీస్తు "ఈ బండ మీద నా సంఘమును కట్టుదును" అని చెప్పెను (మత్త 16:18)
6. కొందరు శిష్యులు బ్రతికి యుండగానే (మార్కు 9:1)
7. మీరు (శిష్యులు) మార్పునొంది చిన్నబిడ్డల వంటి వారైతేనేకాని దానిలో ప్రవేశించరు అని క్రీస్తు చెప్పెను (మత్త 18:3)

8. యేసు చెప్పెను "దేవుని రాజ్యము వచ్చును" (లూకా 22:18)
9. దేవుని రాజ్యము "బలముతో" వచ్చును (మార్కు 9:1). పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు మీరు శక్తి నొందెదరు (అ.కా. 2:47)
10. యేసుక్రీస్తు పునరుత్థానుడై పరలోకమునకు ఆరోహణమైన తరువాత పైన పేర్కొన బడినవన్నియు పెంతెకొస్తు దినమున నెరవేరెను (అ.కా. 2:47)
11. పెంతెకొస్తు దినము తరువాత క్రైస్తవులు సంఘము (లేక) రాజ్యములో ఉండిరి (అ.కా. 2:47; కొల 1:13; హెబ్రీ 12:23,28)

## ఒకడు సంఘములో ఎట్లు ప్రవేశించగలడు ?

1. క్రీస్తు సువార్తను వినుట ద్వారా (రోమా 10:13-17)
2. క్రీస్తు నందు విశ్వాసముంచుట ద్వారా (అ.కా. 16:31)
3. పూర్వపు పాపముల విషయమై మారుమనస్సు పొందుట ద్వారా (లూకా 24:47; అ.కా. 2:38, 17:30)
4. క్రీస్తునందు విశ్వాసముంచి ఒప్పుకొనుట ద్వారా (రోమా 10:8-10)
5. క్రీస్తు లోనికి బాప్తిస్మము పొందుట ద్వారా (రోమా 6:3-4; గల 3:26-27)

## బాప్తిస్మము పొందుటకు ఏమి కావలయును ?

1. నీళ్ళు (మత్తయి 3:11)
2. నీళ్ళు విస్తారముగా ఉండవలెను (యోహా 3:23)
3. నీళ్లలోనికి దిగి వెళ్ళవలెను (అ.కా. 8:38)
4. సమాధి మరియు పునరుత్థానము (రోమా 6:4; కొలస్స 2:21)
5. నీళ్ళలో నుండి బయటకు వచ్చుచుండుట (అ.కా. 8:39; మత్త 3:16)
6. పాపక్షమాపణ కొరకు (అ.కా. 2:38) రక్షింపబడుటకు (1 పేతురు 3:21), పాపములు కడిగి వేసుకొనుట కొరకు (అ.కా. 22:16)

## రక్షణ ఎక్కడ ఉంది ?

1. క్రీస్తు సంఘమునందు, ఆయన తన స్వరక్తమిచ్చి సంపాదించిన సంఘము నందు (అ.కా. 20:28)
2. సంఘమునందు, ఏ సంఘమునకు క్రీస్తు రక్షకుడై యున్నాడో ఆ సంఘము నందు (ఎఫెసీ 5:23)
3. సంఘమునందు, మనము ఎక్కడైతే దేవునితో సమాధాన పరచబడి యున్నామో ఆ శరీరమునందు లేక సంఘమునందు (ఎఫెసీ 2:16)
4. ఏ సంఘము కొరకు క్రీస్తు తన్నుతాను అప్పగించుకొని యున్నాడో ఆ సంఘము నందు చేర్చుకొనును (అ.కా. 2:47)
5. సంఘమునకు వెలుపల ఏ మనుష్యుడు రక్షణ పొందజాలడు, రక్షింపబడు వారిని ప్రభువేతన సంఘమునందు చేర్చుకొనును (అ.కా. 2:47). (సంఘ సభ్యత్వము మరియు రక్షణ కొరకు అవసరమైనది బాప్తిస్మము ఒక్కటే)
6. దేవుని కుటుంబము లేక దేవుని మందిరమైయున్న సంఘమునందు (1 తిమోతి 3:15)
7. ఇశ్రాయేలు వారిని సాదృశ్యముగా తీసికొనిన (1 కొరింథి 10:16)
   - ఎ. ఎఱ్ఱ సముద్రము బాప్తిస్మమునకు సాదృశ్యము
   - బి. అరణ్యము సంఘమునకు సాదృశ్యము
   - సి. యొర్దాను నది మన యొక్క మరణమునకు సాదృశ్యము (బాప్తిస్మములో)
   - డి. కనాను దేశము పరలోకమునకు సాదృశ్యము
   - ఇ. ఇశ్రాయేలీయులు అరణ్యము ద్వారా వెళ్లిరి (దానికి ప్రతిగా సూచించు నది - సంఘము) కనానులో ప్రవేశించుట (దానికి ప్రతిగా సూచించు నది - పరలోకము)

ఎఫ్. కావున మనము పరలోకములో ప్రవేశించవలెననిన సంఘము ద్వారా వెళ్లవలయును. మరి యొక మార్గమున ప్రవేశించాలని ప్రయత్నింపకుము.

## సంఘము యొక్క పనియేమి ?

1. సభ్యుల క్షేమాభివృద్ధి (రోమా 14:19; 1 కొరిం 14:12; ఎఫె 4:11-16)
2. పంచిపెట్టుపని లేదా మేలు చేయుట లేదా ఔదార్య కార్యక్రమములు సహాయ సహాకార కార్యక్రమములు అందించుట (ఎఫె 4:28; గల 6:10)
3. సువార్త ప్రకటన (మార్కు 16:15; మత్త 28:19)
   - ఎ. సువార్త "రక్షణ పొందువారికి అని దేవుని శక్తియై యున్నది" (రోమా 1:16)
   - బి. సువార్త అనగా క్రీస్తు మరణము సమాధి మరియు పునరుత్థానము (1 కొరింథి 15:3-4)
   - సి. సువార్త ప్రకటించు పద్ధతులు:
     1. ప్రసంగ వేదిక బోధ (Pulpit Preaching)
     2. బైబిలు తరగతులు
     3. రేడియో ద్వారా ప్రసంగించుట
     4. సువార్త పత్రికలు, కరపత్రములు పంచిపెట్టుట
     5. వ్యక్తిగత సువార్త

## సంఘము యొక్క ఆరాధన విధానమేమి ?

1. వారములో మొదటిదినమున ప్రభువు బల్ల (ప్రభురాత్రి భోజనం)లో పాలు పొందుట (1 కొరిం 10:16, 11:23-30; అ.కా. 20:7; లూకా 22:29-30)
2. పాటలు పాడుట (ఎఫెసి 5:18-19; కొలస్స 3:16)
3. ప్రార్థించుట (అ.కా. 2:42; 1 థెస్స 5:17)

4. కానుకలిచ్చుట (1 కొరిం 16:2; 2 కొరిం 9:7)
5. బోధించుట మరియు ఉపదేశించుట (అ.కా. 2:42; 2 తిమో 3-15)

## సంఘము యొక్క పరిపాలన విధానమేమి ?

1. స్థానిక సంఘములుగా పరిపాలించబడును, అన్ని ఇతర స్థానిక సంఘముల నుండి స్వతంత్రముగా నుండును
2. క్రీస్తు రాజుగా మరియు శిరస్సుగా స్వయం పరిపాలన (ఎఫెసీ 1:23; కొలస్స 1:13)
   ఎ. అధ్యక్షులతో (పెద్దలు, కాపరులు, నాయకులు). ఎవరైతే పెంచి పోషించి సంరక్షించునో వారు మందను కాయు వారును, పాలించువారును మరియు పై విచారణ చేయువారు (అ.కా. 20:17,18; 1 పేతురు 5:24; 1 తిమోతి 3:1-7)
   బి. పరిచారకులు, సేవ లేదా పరిచర్య చేయువారు (1 తిమోతి 3:8-13; ఫిలి 1:1)
   సి. సభ్యులు - క్రీస్తు శరీరములో (సంఘములో) అవయవములుగా పని చేయుదురు (1 కొరిం 12:24-27)

**బైబిలు బోధించుచున్నట్లుగా మీ సంఘము పరిపాలించ బడుచున్నదా ?**
**మీకు దగ్గరలో ఉన్న క్రీస్తు సంఘము సేవా కార్యక్రమములకు**
**మీరెందుకు హాజరు కాకూడదు ?**

-- M. దేవానంద్
తాడేపల్లిగూడెం

# ఆశ్చర్యకరుడైన క్రీస్తు
# (The Wonderful Christ)

క్రీస్తు పుట్టుక 700 సంవత్సరములకు ముందు ఆయనను గూర్చి యెషయా ప్రవక్త ఇట్లు ప్రవచించెను: "ఏలయనగా మనకు శిశువు పుట్టెను, మనకు కుమారుడు అనుగ్రహింపబడెను. ఆయన భుజముమీద రాజ్యభారముండును. ఆశ్చర్యకరుడు, ఆలోచనకర్త, బలవంతుడైన దేవుడు. నిత్యుడగు తండ్రి సమాధాన కర్తయగు అధిపతి అని అతనికి పేరు పెట్టబడును" (యెషయా 9:6). యెషయా ప్రవచించిన ఆశ్చర్యకరుడైన యేసుక్రీస్తు యొక్క వ్యక్తిత్వమును గూర్చి, ఆయన క్రియలను గూర్చి ఈరోజు మనము కొంత తెలిసికొందము.

యేసుక్రీస్తు ఆశ్చర్యకరుడు. మరి యే మానవుడు ఎన్నడు జన్మించని రీతిగా ఆయన ఈలోకమందు జన్మించెను. ఆయన దేవుని ప్రభావమువలన కన్యయైన మరియకు జన్మించెను. క్రీస్తుకు భూసంబంధమైన తండ్రిలేడు. దేవుడే ఆయనకు తండ్రి అందువలననే యేసుక్రీస్తు దేవుని అద్వితీయకుమారుడై యున్నాడు. ఆయన ఆశ్చర్యకరుడు. ఏలయనగా ఆయన దైవ మానవునిగాను, మానవ దేవునిగాను ఉండెను. "నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువని" పేతురు ఆయనను గూర్చి ఒప్పుకొనెను (మత్తయి 16:16). ఆయన అయితే నేను మనుష్య కుమారుడనని చెప్పుకొనెను: "మనుష్య కుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును, అనేకులకు ప్రతిగా విమోచనక్రయ ధనముగా తన ప్రాణమును ఇచ్చుటకును వచ్చెను" అని తనను గూర్చి క్రీస్తు చెప్పుకొనెను (మార్కు 10:45).

క్రీస్తుకు ఆశ్చర్యకరమైన శక్తి ఉండెను. ఏలయనగా దేవుడు తాను పంపిన వానికి కొరత లేకుండ ఆత్మననుగ్రహించెను. యేసు గ్రుడ్డివారిని బాగుచేసెను. యేసును, ఆయన శిష్యులును బేత్సయిదాకు వచ్చిరి. అప్పుడు అక్కడివారు ఆయనయొద్దకు ఒక గ్రుడ్డివానిని తోడుకొనివచ్చి, వానిని ముట్టవలెనని

అయనను వేడుకొనిరి. ఆయన గ్రుడ్డివాని చెయ్యిపట్టుకొని ఊరు వెలుపలికి తోడుకొనిపోయి, వాని కన్నులు మీద ఉమ్మివేసి, వానిమీద చేతులుంచి, నీ కేమైనను కనబడుచున్నదా ? అని వానినడుగగా, వాడు కన్నులెత్తి మనుష్యులు నాకు కనబడుచున్నారు; వారు చెట్లవలెనుండి నడుచుచున్నట్లుగా నాకు కనబడుచున్నారనెను; అంతట ఆయన మరల తనచేతులు వాని కన్నులమీద నుంచగా వాడు తేరిచూచికుదర్చబడి సమస్తమును తేటగా చూడసాగెను" (మార్కు 8:22-25). యేసు చనిపోయిన వారిని ప్రాణముతో లేవదీసెను. సమాజమందిరపు అధికారియైన యాయీరను నతని పండ్రెండు సంవత్సరముల ప్రాయముగల కుమార్తె చనిపోయెను, యేసు ఆ చిన్నదాని తల్లిదండ్రులను, తనతో ఉన్నవారిని వెంటబెట్టుకొని, ఆ చిన్నది పరుండియున్న గదిలోనికి వెళ్లి ఆ చిన్నదాని చేయిపట్టి, చిన్నదానా, లెమ్మని చెప్పెను. వెంటనే ఆ చిన్నది లేచి నడవసాగెను (మార్కు 5:34-42). యేసు తన శిష్యులతో కలసి ఒక చిన్నదోనెలో ప్రయాణము చేయుచుండగా పెద్ద తుఫాను రేగెను. అప్పుడాయన లేచిగాలిని గద్దించి, నిశ్శబ్ధమై ఊరకుండుమని సముద్రముతో చెప్పగా, గాలి అణిగి, మిక్కిలి నిమ్మళమాయెను. ఆయన శిష్యులు మిక్కిలి భయపడి-ఈయన ఎవరో, గాలియు, సముద్రమును ఈయనకు లోబడుచున్నవని యొకనితో నొకడు చెప్పుకొనిరి (మార్కు 4:35-41). అవును, యేసు ఆశ్చర్యకరుడు, ఆయన తన ఆశ్చర్యశక్తిని అనేకసారులు ప్రజలయెదుట బయలుపరచెను. ఆయన అనేక అద్భుతములు, మహత్కార్యములు చేసెను. అవన్నియును వ్రాయబడవలెనన్న భూలోకమందున్న గ్రంథములన్నియును చాలవు. అయితే కొన్ని మాత్రమే క్రొత్త నిబంధనలో వ్రాయబడెను. "యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును అవి వ్రాయబడెను" అని యోహాను వ్రాసెను (యోహాను 20:30,31).

## ఆశ్చర్యకరమైన మాటలు

యేసు ఆశ్చర్యకరమైన మాటలను పలికెను. "ఆత్మ విషయమై దీనులైన

వారు ధన్యులు; పరలోక రాజ్యము వారిది, దుఃఖపడువారు ధన్యులు; వారు ఓదార్చబడుదురు. సాత్వికులు ధన్యులు; వారు భూలోకమును స్వతంత్రించు కొందురు. నీతికొరకు ఆకలి దప్పులు గలవారు ధన్యులు; వారు తృప్తిపరచ బడుదురు. కనికరము గలవారు ధన్యులు; వారు కనికరము పొందుదురు. హృదయ శుద్ధిగలవారు ధన్యులు; వారు దేవుని చూచెదరు. సమాధాన పరచు వారు ధన్యులు; వారు దేవుని కుమారులనబడుదురు. నీతి నిమిత్తము హింసింప బడువారు ధన్యులు; పరలోక రాజ్యము వారిది" అని యేసు బోధించెను (మత్తయి 5:3-10). మరియు "ఏమి తిందుమో, యేమి త్రాగుదుమో అని మీ ప్రాణమును గూర్చియైనను, ఏమి ధరించుకొందుమో అని మీ దేహమును గూర్చియైనను చింతింపకుడి; ఆహారముకంటె ప్రాణమును, వస్త్రముకంటె దేహమును గొప్పవి కావా ?". "కాబట్టి-ఏమితిందుమో, యేమిత్రాగుదుమో, యేమీ ధరించుకొందుమో అని చింతింపకుడి. అన్యజనులు వీటి విషయమై విచారింతురు. ఇవన్నియు మీకు కావలెనని మీ పరలోకపు తండ్రికి తెలియును. కాబట్టి మీరు ఆయన రాజ్యమును, నీతిని మొదట వెదకుడి; అప్పుడవన్నియు మీ కనుగ్రహింపబడును" అని యేసు బోధించెను (మత్తయి 6:25-34). "యేసు ఈ మాటలు చెప్పి ముగించినప్పుడు జనసమూహములు ఆయన బోధకు ఆశ్చర్యపడుచుండిరి. ఏలయనగా ఆయన వారి శాస్త్రులవలెకాక అధికారముగల వానివలె వారికి బోధించెను" (మత్తయి 7:28-29).

## ఆశ్చర్యకరమైన అధికారము

యేసుక్రీస్తు ఆశ్చర్యకరమైన అధికారము కలిగియుండెను. ఆయన బోధించునప్పుడు అధికారముగలవానివలె బోధించెను. ప్రకృతి శక్తులు ఆయన అధికారమునకు లోబడెను; అపవిత్రాత్మలు ఆయన అధికారమునకు భయపడి ఆయనకు లొంగెను. చివరకు మృత్యువునుకూడ ఆయన లోబరచుకొనెను. ఆయన చనిపోయినవారికి తిరిగి ప్రాణమును పోయుటయేగాక, ఆయనే చనిపోయి తిరిగిలేచెను. ఇది ఎంత ఆశ్చర్యమో ! ఆయన మృత్యుంజయుడై

లేచిన తరువాత, "పరలోకమందును భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్యబడి యున్నది. కాబట్టి మీరు వెళ్లి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి, తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామము లోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు, నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటి నన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి" యని తన అపొస్తలుల నాజ్ఞాపించెను (మత్తయి 28:18-20).

## ఆశ్చర్యకరమైన స్థానము

యేసుక్రీస్తు ఇప్పుడు పరలోకమందు ఒక ఆశ్చర్యకరమైన స్థానమును కలిగియున్నాడు. ఆయన పునరుత్థానుడైన తరువాత పరలోకమునకు ఆరోహణు డాయెను. దాని విషయమై పేతురు యిట్లు సాక్ష్యము పలికెను: "క్రీస్తు పాతాళము లో విడువబడలేదనియు ఆయన శరీరము కుళ్లిపోలేదనియు దావీదు ముందుగా తెలిసికొని ఆయన పునరుత్థానమును గూర్చి చెప్పెను. ఈ యేసును దేవుడు లేపెను; దీనికి మేమందరము సాక్షులము. కాగా ఆయన దేవుని కుడి పార్శ్వమునకు హెచ్చింపబడెను. మీరు సిలువవేసిన యీ యేసునే దేవుడు ప్రభువు గాను, క్రీస్తుగాను నియమించెను. ఇది ఇశ్రాయేలు వంశమంతయు రూఢిగా తెలిసికొనవలెను" (అపొ.కా 2:31-36). "ఆయన తన యెదుట ఉంచబడిన ఆనందము కొరకై అవమానమును నిర్లక్ష్యపెట్టి, సిలువను సహించి, దేవుని కుడి పార్శ్వమున ఆసీనుడై యున్నాడు" అని అపొ.పౌలు హెబ్రీ 12:2లో వ్రాసెను.

యేసుక్రీస్తు మరల రాబోవుచున్నాడు. ఆయన మొదటిసారి వచ్చినపుడు పాపులను రక్షించుటకు వచ్చెను. ఆయన రెండవసారి వచ్చునప్పుడు పాపులకు తీర్పుతీర్చుటకు వచ్చును. ఇందు విషయమై దైవవేదము ఇట్లు బోధించుచున్నది. తన మహిమతో మనుష్య కుమారుడును ఆయనతో కూడ సమస్త దూతలును వచ్చునప్పుడు ఆయన తన మహిమగల సింహాసనము మీద ఆసీనుడై యుండును. అప్పుడు సమస్త జనములు ఆయన యెదుట పోగుచేయ బడుదురు. గొల్లవాడు మేకలలో నుండి గొర్రెలను వేరు పరచునట్లు ఆయన

వారిని వేరుపరచి తన కుడివైపున గొర్రెలను, ఎడమవైపున మేకలను నిలువబెట్టును. అప్పుడు రాజు కుడివైపున ఉన్నవారిని చూచి - నా తండ్రి చేత ఆశీర్వదించబడిన వారలారా, రండి; లోకము పుట్టినది మొదలుకొని మీ కొరకు సిద్ధపరచబడిన రాజ్యమును స్వతంత్రించుకొనుడి అని చెప్పను. ఆయన ఎడమవైపున ఉండువారిని చూచి శపింపబడిన వారలారా, నన్ను విడిచి అపవాదికిని వాని దూతలకును సిద్ధపరచ బడిన నిత్యాగ్నిలోనికి పోవుడి అని చెప్పను. వీరు నిత్య శిక్షకును, నీతిమంతులు నిత్య జీవమునకును పోవుదురు. మత్తయి 25:31-46 వరకు దయచేసి చదువండి.

యేసుక్రీస్తు ఆశ్చర్యకరుడని ఈ దినము మనము గ్రహించితిమి. ఆయన యిచ్చు నిత్యజీవములో ప్రవేశింపవలెనంటె ఆశ్చర్యకరుడైన యేసునందు విశ్వాసముంచండి. మీ పాపములు విషయమై మారుమనస్సు పొంది పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందండి. అట్లుచేసి ఆయన సంఘమందు ప్రవేశించి ఆశ్చర్యకరమైన క్రైస్తవ సహవాసములో పాలుపొందండి !

-- జాషువా గూటం


## క్రైస్తవ కీర్తనలు

237 పాటలు గల క్రైస్తవ కీర్తనలు పుస్తకం మరల ముద్రింపబడినది. దానిలో అనేక పాత, క్రొత్త కీర్తనలున్నవి. సత్యవాణిలో ప్రసారము చేయబడుచున్న కీర్తనలు కూడా యున్నవి. ఒక్కొక్క కాపీవెల 18 రూపాయలు. పోస్టేజీ 4 రూపాయలు అదనం. వలయువారు దిగువ చిరునామకు M.O పంపండి. M.O దిగువ కూపను మీద మీ అడ్రసు తప్పక వ్రాయండి:

SATYA VANI, P.O.BOX-80, KAKINADA - 533 001.

మధ్యాహ్నానికి అమెరికా క్షేమముగా చేరుకొనిరి. సెప్టెంబరు 11వ తేదీ నాడు అమెరికా దేశములో ఉగ్రవాదులు సృష్టించిన భయంకర పరిస్థితులలో చిక్కుకొనకుండ ఆయన క్షేమముగా యున్నారు. రిక్కీగారిని గూర్చి వందలాది మంది ఫోన్లుచేసి, ఆయన కొరకు ప్రార్థించుచున్న వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలుపుచున్నారు.

2001 జూలై 8,9,10 తేదీలలో మైలవరం భాస్కరనగర్‌లో గొప్ప సువార్త కూటములు జరిగెను. ఆ కూటముల సందర్భముగా ఆరుగురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరని సోదరులు టి. ప్రసాద్‌రావ్ గారు తెలియజేసి యున్నారు.

సెప్టెంబరు 5వ తేదీనాడు కృష్ణాజిల్లా కేసరపల్లిలో ప్రత్యేక బైబిలు తరగతులు నిర్వహించబడెను. సంఘపెద్దలు వారి బాధ్యతలు అను అంశము అక్కడ బోధింపబడెను. సోదరులు పి. షద్రక్ (గన్నవరం), కె. రాజకుమార్ (విజయవాడ), జె. డేవిడ్ రాజు, జి. మురళీకృష్ణ, పి.డి.డి. కుమార్‌గార్లు వాక్యపరిచర్య చేసిరి.

సెప్టెంబరు 14వ తేదీ శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా రఘుదేవపురంలో ఏర్పాటు చేయబడిన సువర్త కూటములో సోదరులు జాషువా గూటం గారు వాక్యపరిచర్య చేసిరి. ఆ కూటమునకు పలువురు హైందవులు, మతశాఖల వారు హాజరైరి. క్రీస్తును గూర్చి, ఆయన సంఘమును గూర్చిన సత్యము చొప్పున నడుచుకొనుటకు ఆసక్తి కనుబరచిరి. రఘుదేవపురంలో సోదరులు బి. ధర్మరాజు గారు పలు సంవత్సరముల నుండి సువార్త చాటుచున్నారు.

సెప్టెంబరు 26వ తేదీనాడు విజయనగరం జిల్లా పాచిపెంటలో ఏర్పాటు చేయబడిన సువార్త కూటములో జాషువా గూటం గారు సతీసమేతముగా హాజరై వాక్యపరిచర్య చేసిరి. ఆ కూటమునకు ఆరువందల మంది హాజరై గొప్ప సహవాసములో పాల్గొనిరి. 21మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. పాచిపెంట లోను దానికి పరిసరంగా యున్న పది గ్రామములలోను తామస్ జాన్సన్ గూటం గారు గత రెండుదశాబ్ధములుగా సువార్త చాటుచు అనేకులను సత్యములోనికి నడిపించిరి. తామస్ గారితో కలిసి సోదరులు కలికోట వెంకట్రావు, వడ్డాది సింహాద్రి, ఎరగడ శ్రీనివాసరావు, గంట రామకృష్ణగార్లు సువార్త చాటుటలో సహకరించుచున్నారు. వీరందరు పాచిపెంట, పెద్దవలస, పద్మాపురం, రెల్లివీధి, క్రొత్తవలసలో రెండుచోట్ల, కర్రివల్స, బొబ్బిలివల్స, కేసలి, తోటవలస అను గ్రామములలో క్రీస్తు సంఘముల నేర్పాటుచేసిరి. పాచిపెంటలో చక్కగా నిర్మించబడిన సంఘ ఆలయము కూడకలదు. ఒరిస్సా రాష్ట్రమునకు సరిహద్దులలో యున్న ఈ గ్రామములలో జరుగుచున్న సువార్త పనికొరకు ప్రార్థించ మనవి.

2001 సెప్టెంబరు 29వ తేదీ శనివారం అమలాపురం మండలం పాలగుమ్మి గ్రామములో నిర్మించబడిన ఆలయమును క్రీస్తు సేవకొరకు జాషువా గూటం గారు ప్రతిష్టచేసిరి. ఆ దినము చాల విపరీతముగా వర్షము కురియుచున్నను స్థానిక సంఘస్థులు నిర్ణయించిన ప్రకారము కార్యక్రమమంతయు జయప్రదముగా నిర్వహించబడినది. పాలగుమ్మిలో మొదట సోదరులు డి. అబ్రాహాము గారు సువార్త పని ప్రారంభించిరి. ఆయన మరణానంతరము అబ్రాహాము గారి కుమారుడు చిరంజీవి గారు పాలగుమ్మిలోను, మరి రెండు గ్రామములలోను సువార్త చాటుచున్నారు. పాలగుమ్మిలో నిర్మించబడిన ఆలయము అంతయు స్థానిక సంఘ సభ్యుల విరాళములతో నిర్మించబడినది. ఆలయ ప్రతిష్టకు జాషువా గారు సతీసమేతముగా హాజరై చక్కటి వాక్యపరిచర్య చేసిరి. ఒక స్త్రీ క్రీస్తులోనికి పొందినది. విపరీత వర్షము కురియుచుండగా గ్రామకాలువలో ఆమెకు బాప్తిస్మమిచ్చుట జరిగినది. విరాళాలిచ్చిన వారికి, హాజరైన వారందరికీ చిరంజీవి గారు కృతజ్ఞత చెల్లించిరి. తదుపరి మంచి విందు ఏర్పాటు చేయబడెను.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/05/2001

**From:**

**SATYA VAKKU**
**P.O. BOX 80,**
**KAKINADA - 533 001**

**To**

Edited & Published and Owned by Joshua Gootam & Published at Satya Vani Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. KAKINADA - 533 004. Editor : Joshua Gootam.